క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి పర్యటన

సదుం: మండలంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గురువారం పర్యటిస్తారని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ రెడ్డెప్ప రెడ్డి తెలిపారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో నూతన వినాయకస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డితో కలిసి పాల్గొంటారని చెప్పారు.

స్టాక్ పాయింట్ పరిశీలన



స్టాకును పరిశీలిస్తున్న సమగ్ర శిక్ష డీడీ అనురాధ

శాంతిపురం: పెద్దబొమ్మనపల్లె ప్రాథమిక పాఠశాలలోని సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర సామగ్రి స్టాక్ పాయింట్‌ను సమగ్ర శిక్ష డీడీ అనురాధ బుధవారం పరిశీలించారు. నిల్వ ఉన్న సామగ్రి, పాఠశాలకు రవాణా అవుతున్న తీరును ఎంఈఓ చంద్రశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల పునః ప్రారంభం నాటికి అన్ని పాఠశాలల్లో విద్యాసామగ్రి పంపిణీ అయ్యేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏసీఎంఓ మధుసూదన్, ఎంఆర్సీ సిబ్బంది, పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ జాతర



విశేష అలంకరణలో ముత్యాలమ్మ

పెద్దపంజాణి: మండలంలోని సాన్నేపల్లెలో ముత్యాలమ్మ జాతరను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలోని అమ్మవారి మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, పూజలు చేసి విశేషంగా అలంకరించారు. గ్రామంలో అమ్మవారి ఊరేగింపు సందర్భంగా ప్రతి ఇంటా కర్పూర హారతులిచ్చి కొబ్బరి కాయలు కొట్టారు. గ్రామ దేవతలకు పిండి దీపాలు పెట్టి మొక్కులు చెల్లించారు.

ముక్త్ భారత్‌తో క్షయను అరికడుదాం



చౌడేపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య బృందం

చౌడేపల్లె: ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంతో వంద రోజుల్లో క్షయ(టిబి) వ్యాధిని అరికడుదామని వైద్యాధికారి పవన్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం టిబి ముక్త్ భారత్ కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గళ్ల పరీక్ష , ఎక్స్‌రే ద్వారా వ్యాధిని నిర్ధారించడం సాధ్యమన్నారు. ప్రభుత్వం వ్యాధి నివారణకు ఉచితంగా మందులు ఇస్తోందన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

చిత్తూరు అర్బన్: ప్రజలు సీజనల్ వ్యాధులు, విష జ్వరాల బారిన పడకుండా ఉండేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ ప్రజారోగ్యశాఖ అధికారి డాక్టర్ లోకేష్ అన్నారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం మునిసిపల్ కార్యాలయంలో క్రిమి కీటకాల వల్ల కలిగే వ్యాధుల నియంత్రణపై అధికారులకు అవగాహన కల్పించారు. వర్షాలు రానున్న నేపథ్యంలో ఇంజినీరింగ్, ప్రజారోగ్యశాఖ విభాగాలు సంయుక్తంగా పని చేయాలన్నారు. అనంతరం దోమల నిర్మూలన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి రామకృష్ణ, డీఈ శ్రావణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

పలమనేరు: వెన్నుపోటు దినం ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు నాయకులు





పుంగనూరులో వెన్నుపోటు దినం నిరసన ర్యాలీలో అభివాదం చేస్తున్న పెద్దిరెడ్డి

వెన్నుపోటు దినం.. పోటెత్తిన జనం

- ఏడాదిగా బాబుది అరాచక పాలనే
- హామీలతో ప్రజలకు వెన్నుపోటు
- రూ.1.50లక్షల కోట్లు అప్పు చేయడమేనా సంపద సృష్టి?
- వెన్నుపోటు దినం నిరసనలో పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్ విమర్శ
- ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్

చౌడేపల్లె (పుంగనూరు)/పలమనేరు/కుప్పం: అధికారంలోకి వచ్చి ఏడాదైనా కూటమి ప్రభుత్వం హామీలు నెరవేర్చకపోవడాన్ని నిరసిస్తూ వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు బుధవారం పుంగనూరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో నిర్వహించిన వెన్నుపోటు దినం నిరసన ర్యాలీతో హోరెత్తాయి. పుంగనూరు ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అనీషారెడ్డి, పలమనేరులో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్ వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, కుప్పంలో ఎమ్మెల్సీ, సమన్వయకర్త భరత్ నేతృత్వంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, అభిమానులు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఆయా నియోజకవర్గాల్లోని అన్ని మండలాల నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి వచ్చారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కొన్నిచోట్ల పోలీసుల అవరోధాలు, ఆటంకాలు కల్పించినా ఎదురొడ్డి కూటమి ప్రభుత్వ పాలనపై నిప్పులు చెరిగారు. ర్యాలీలో ప్లకార్డులు పట్టుకుని నిరుద్యోగభృతి ఎప్పుడు ఇస్తావు బాబు?..ఉచిత బస్సు ఎప్పుడు బాబు?..తల్లికి వందనం ఇచ్చేదెప్పుడు?...రైతు బీమాకు ఎగనామం, బాబు గ్యారెంటీ మోసం..50 ఏళ్లకే పెన్షన్, పంటలకు గిట్టుబాటు ధర ఎక్కడ బాబూ?..సూపర్‌సిక్స్‌తో దగా.. తల్లికి వందనం కాదు–ఎగనామం.. అంటూ ప్లకార్డులతో దారిపొడవునా నినాదాలతో హోరెత్తించారు. పుంగనూరులో తహసీల్దార్‌కు రాముకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి, పలమనేరు ఆర్డీఓ కార్యాలయంలో అధికారులకు వెంకటేగౌడ, కుప్పంలో తహసీల్దార్ చిట్టిబాబుకు ఎమ్మెల్సీ భరత్ తదితరులు వినతి పత్రాలు అందజేసి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదని, ఇప్పటికీ అరాచక పాలనతో తమ పార్టీ అభిమానులపై హత్యలు, హత్యాయత్నాలు, వేధింపుల పర్వం కొనసాగిస్తున్నారని, పోలీసులను అడ్డుగా పెట్టుకుని, అక్రమ కేసులు బనాయించి, జైలుకు పంపుతున్నారని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో అలవికాని హామీలు, 'సూపర్‌సిక్స్'తో ప్రజలను బురిడీ కొట్టించి, అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం హామీలను నెరవేర్చకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచిందని నిప్పులు చెరిగారు. మునలమ్మ కూడా బటన్ నొక్కుతుందని నాడు పథకాల అమలుపై నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని అపహాస్యం చేసిన చంద్రబాబు ఇప్పుడు సీఎంగా ప్రజలకు పథకాల ఫలాలకు సంబంధించి బటన్ నొక్కడానికి చేతులు రావడం లేదని వ్యంగ్యంగా అన్నారు. మరోవైపు పోలీసులను అడ్డుపెట్టుకుని 'రెడ్‌బుక్' అరాచకం పెచ్చరిల్లుతోందని, ఇదెన్నో రోజులు సాగదన్నారు. ప్రతి మంగళవారం అప్పు చేయనిదే ఈ ప్రభుత్వం ముందుకెళ్లడం లేదని దుయ్యబట్టారు. ఇప్పటికే లక్షా యాభై వేల కోట్లు అప్పు చేయడమేనా సంపద సృష్టి అంటే అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎటుచూసినా గంజాయి అమ్మకాలు, వీధివీధినా బెల్టుషాపులు, ఇసుక అక్రమ రవాణా మాత్రం కూటమి పాలనలో విచ్చలవిడిగా సాగుతోందన్నారు. వెన్నుపోటు దినం నిరసనకు పెద్ద ఎత్తున వచ్చిన జనం చూస్తే ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై ఎంత వ్యతిరేకత ఉందో ఇట్టే తెలుస్తోందన్నారు. ఇక, కుప్పంలో సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్నా ఏడాది పాలనలో అభివృద్ధి పరంగా చేసిందేమీ లేదని, కనీసం ఒక్క రోడ్డు కూడా వేయలేదని ఎండగట్టారు.



పుంగనూరు నిరసన ర్యాలీలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప, అనీషారెడ్డి తదితరులు

కుప్పంలో ర్యాలీకి పోలీసుల అవరోధాలు



ర్యాలీ అడ్డుకుంటున్న పోలీసులు



ఎమ్మెల్సీ భరత్ అడ్డుకుంటున్న పోలీసులు

కుప్పంలో వెన్నుపోటు దినం నిరసన ర్యాలీకి పోలీసులు అవరోధాలు కల్పించారు. కేవలం 30 మంది మాత్రమే అనుమతి ఉందని, పట్టణంలో ర్యాలీ నిషేధమంటూ ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయం వద్ద నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ఒకటిన్నర కిలోమీటరు దూరం పొడవునా పోలీసులు ర్యాలీని అడ్డుకునే ప్రయత్నాలు చేసినా పార్టీ శ్రేణులు ఎదురొడ్డి నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేశాయి. ప్లకార్డులు, పార్టీ జెండాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో ఎంపీపీ వరలక్ష్మి, కోదండరెడ్డి, జెడ్పీటీసీలు కృష్ణమూర్తి, నితిన్, కన్వీనర్లు రామకృష్ణ, బాబురెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు హఫీజ్, ఇళయరాజ్, మణి, మునిరాజ్, మోహన్ రామ్, రాజ్‌కుమార్, విజయ్ కుమార్, నాగరాజ్, భాస్కర్ నాయక్, భాగ్యరాజ్, గిరి, మురుగేష్ తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు నిరసనలో పాల్గొన్న నాయకులు:

టీటీడీ బోర్డు మాజీ మెంబరు పోకల అశోక్‌కుమార్, జెడ్పీ మాజీ వైస్ పెద్దిరెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి రెడ్డిశ్వర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, ఎంపీపీలు అక్కిసాని భాస్కర్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, జెడ్పీటీసీలు దామోదర్‌రాజు, సోమశేఖర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పార్టీ అధ్యక్షులు అమరనాథరెడ్డి, ఇర్ఫాన్, నాగభూషణరెడ్డి, గంగాధరం, చింతల రెడ్డెప్పరెడ్డి, నాదమునిరెడ్డి, కరీముల్లా, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ చెంగారెడ్డి, పార్టీ నాయకులు నాగభూషణం, ఫకృద్దీన్ షరీఫ్, వెంకటరెడ్డి యాదవ్, అమ్ము, జయరామిరెడ్డి, రాజేష్, సురేష్, నరేష్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

పలమనేరులో..

పార్టీ రాష్ట్ర కార్యదర్శులు క్రిష్ణమూర్తి, రంగన్న, మురళీకృష్ణ, గణేష్‌యాదవ్, శ్రీరాములురెడ్డి, నాగరాజ్, మండల కన్వీనర్లు హేమంత్‌కుమార్‌రెడ్డి, బాలాజీనాయుడు, బాగారెడ్డి, భాస్కర్‌రెడ్డి, కేశవులు, యువరాజ్, ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, దయానందగౌడ, చెంగారెడ్డి, మండీసుధా, ప్రహ్లాద, శ్రీనివాసులు రెడ్డి, జాఫర్ నియోజకవర్గంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కుప్పం : ర్యాలీగా వెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కుప్పం : తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్సీ భరత్



పలమనేరు : ఆర్డీఓ కార్యాలయ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్, నాయకులు

నేటి నుంచి విత్తనాల పంపిణీ

పలమనేరు: మండలంలో గురువారం నుంచి 11వ తేదీ వరకు రైతులకు సబ్సిడీతో వేరుశనగ విత్తనకాయలను పంపిణీ చేయనున్నట్టు స్థానిక ఏవో సంధ్య తెలిపారు. మండలంలోని టి.వడ్డూరు రైతు సేవా కేంద్రంలో రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను బుధవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. మండలానికి 672 క్వింటాళ్ల విత్తనాలు వచ్చాయన్నారు.

గంగవరంలో..

గంగవరం: మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో గురువారం నుంచి విత్తనాల నమోదు కార్యక్రమం ఉంటుందని వ్యవసాయాధికారి హేమలత బుధవారం తెలిపారు. గంద్రాజుపల్లె–1, కీలపట్ల, పసుపత్తూరు ఆర్‌ఎస్‌కే కేంద్రాలు మినహా మిగిలిన 15 కేంద్రాల్లో ఈ నమోదు కార్యక్రమం ఉంటుందని చెప్పారు. విత్తనాలు వేసే రైతులు మాత్రమే నమోదు చేసుకోవాలని ఆమె కోరారు. మిగిలిన మూడు రైతు సేవా కేంద్రాల్లో 9వ తేదీ నుంచి నమోదు చేస్తామన్నారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో 6వ తేదీ శుక్రవారం నుంచి వేరుశనగ విత్తన కాయల కోసం రిజిస్ట్రేషన్ చేయనున్నట్టు ఏఓ జ్యోతమ్మ బుధవారం తెలిపారు. కాయలు అవసరమైన రైతులు పట్టాపాసుపుస్తకం, ఆధార్, మొబైల్ తీసుకెళ్లాలన్నారు. 5న గడ్డంవారిపల్లె, 6న చారాల, ఏ.కొత్తకోట, కాగతి, కాటిపేరి, లద్దిగం, పందిళ్లపల్లె, దుర్గసముద్రం, 8న చౌడేపల్లె, పరికిదొన, 9న కొండామర్రి, వెంగళపల్లె, 10న చింతమాకులపల్లె, దిగువపల్లె రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు.



టి.వడ్డూరులో విత్తనాలను రైతులకు చూపెడుతున్న ఏవో సంధ్య, సిబ్బంది

విత్తనాల పంపిణీ తనిఖీ

పెద్దపంజాణి: ఖరీఫ్ 2025కి సంబంధించి మండలంలోని వీరప్పల్లె రైతు సేవా కేంద్రంలో సబ్సిడీ వేరుశనగ విత్తనాల పంపిణీ, రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ బుధవారం తనిఖీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ రాయితీలు, పథకాలు పొందాలంటే విత్తనాలు తీసుకున్న రైతులు ఖచ్చితంగా వేరుశనగ పంట సాగు చేసి ఈ–క్రాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఉదయం వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఎంపీపీ ఎన్. రెడ్డెప్ప వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పుంగనూరు వ్యవసాయ సహాయ సంచాలకులు శివకుమార్, ఏఓ రఫీబా, ఆర్‌ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.



వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

● ఆశీస్సులు

రొంపిచెర్ల: నూతన వధువరులను పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి బుధవారం ఆశీర్వదించారు. చిన్నగొట్టిగల్లు మండలం రంగన్నగారిగడ్డకు చెందిన మాజీ ఎంపీపీ జి.వి.రమణ కుమారుడు మత్స్యకారుల జిల్లా అధ్యక్షుడు జీవీ.రత్నం కుమారై జీవీ.సుస్మితకు కోట మండలం చిట్టేడుకు చెందిన విజయకుమార్‌తో పెద్దగొట్టిగల్లు సమీపంలోని ఓ కల్యాణ మండపంలో బుధవారం రాత్రి వివాహమైంది. నూతన వధూవరులను ఎమ్మెల్యే, ఎంపీ ఆశీర్వదించారు. ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డిశ్వర్ రెడ్డి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు హరినాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నూతన వధూవరులతో పుంగనూరు ఎమ్మెల్యే, రాజంపేట ఎంపీ

కార్పొరేషన్‌లో లంచావతారులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో పెరిగిపోతున్న అవినీతి, అక్రమాలను అరికట్టాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త విజయానందరెడ్డి కోరారు. బుధవారం వెన్నుపోటు దినం నేపథ్యంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందచేశారు. అనంతరం కార్పొరేషన్ కార్యాలయంలో అవినీతి అక్రమాలు విచ్చలవిడిగా సాగుతోందన్నారు. ప్రధానంగా నగరంలో చిన్నపాటి ఇళ్ల నిర్మించుకోవాలన్నా, సామాన్యులు రూ.లక్షల్లో లంచాలు డిమాండ్ చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయన్నారు. దీనికి అడ్డుకట్ట వేయాలని కలెక్టర్‌ను కోరారు.

చెరువులను చెరబడుతున్న 'పచ్చ'మార్కులు


చెరువులనూ టీడీపీ నాయకులు చెరబడుతున్నారు. వీరి దెబ్బకు మట్టి పూర్తిగా తరిగిపోతోంది.పట్టపగలే హిటాచీతో మట్టి తవ్వడం, టిప్పర్లు, ట్రాక్టర్లలో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు మాద్యం చోద్యం చూస్తున్నారు. నీవైనా చర్యలు తీసుకో దేవుడా! అంటూ దీనికి సంబంధించిన ఓ వినతి పత్రం కోనేటిరాయస్వామి హుండీ లెక్కింపులో బయటపడటం చూస్తే చెరువులు పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

- తరిగిపోతున్న మట్టి
- రూపురేఖలు మారుతున్న చెరువులు
- చోద్యం చూస్తున్న ప్రభుత్వ యంత్రాంగం

గంగవరం: పచ్చ అక్రమార్కులు చెరువులు, కుంటలను మింగేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా చెరువుల్లో ట్రాక్టర్లు, టిప్పర్లతో యథేచ్ఛగా మట్టిని కొల్లగొడుతున్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామ సమీపంలోని పొనక నెల్లూరు చెరువులో ఓ టీడీపీ నాయకుడు 10 రోజులు పైగా మట్టిని తవ్వేస్తుండడంతో చెరువు పూర్తిగా ఖాళీ అయిపోయిందంటూ పంచాయతీ ప్రజలు మండిపడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆ నాయకుడు ఇదే చెరువులో మట్టిని తోలేస్తుండటం రూపురేఖలు మారిపోయింది. ప్రశ్నించిన గ్రామస్తులను బెదిరించడం, దౌర్జన్యం చేయడం, అధికారులను తన చెప్పుచేతల్లో పెట్టుకుని పేట్రేగిపోతున్నాడని గ్రామస్తులు వాపోతున్నారు. చెరువుల్లో సారవంతమైన మట్టి టిప్పర్ లోడు ధర రూ. 5వేలకు పైగా, ట్రాక్టర్ లోడు ధర రూ. 2వేలకు పైగా పలుకుతుండడంతో అక్రమార్కులకు మూడు ట్రాక్టర్లు–ఆరు టిప్పర్లు అన్న చందాన సాగుతోంది.



చెరువులో మట్టి తవ్వకాలు చేస్తున్న హిటాచీ, పక్కన మట్టిని తరలిస్తున్న టిప్పర్లు, ట్రాక్టర్లు



దేవుడి హుండీలో లభించిన వినతిపత్రం

అక్రమార్కునిపై చర్యలు తీసుకునేలా చేయి దేవుడా..!

చెరువులను కొల్లగొడుతున్న వైనం, టీడీపీ నాయకుడి అక్రమాలు, చెరువు మట్టి రవాణాకు పూర్తిగా అడ్డుకట్ట చేసి తమ చెరువును కాపాడాల్సిందిగా దేవుడిని కోరుతూ ఓ వినతి పత్రాన్ని కీలపట్ల కోనేటిరాయస్వామి హుండీలో వేశారు. గత బుధవారం జరిగిన హుండీ లెక్కింపులో ఆ వినతి పత్రం బయటపడింది. అందులో ప్రాణం పోగొట్టుకుంటున్న పొనక నెల్లూరు చెరువు.. ప్రాణం తీస్తున్న అధికార పార్టీ నాయకులు, ఇటుక బట్టీ యజమానులు.. పట్టించుకోని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు (వేర్ ఈజ్ లా ఫార్ ఎనీ వన్) అంటూ తమ ఆవేదనను వెళ్లగక్కారు. హుండీ లెక్కింపు తరువాత ఆ లేఖను ఓ వ్యక్తి ఆ లేఖను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అయితే ఇప్పటికీ అధికారులు చెరువులకేసి దృష్టి సారించకపోవడం గమనార్హం!